క్లుప్తంగా

సైకిల్ ర్యాలీని విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న బోనం రాజు

మలికిపురం: ఆరోగ్యం కోసం సైకిల్ తొక్కుదాం, పర్యావరణం కోసం సైకిల్ తొక్కుదాం అనే నినాదంతో జూన్ 3న ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా హెల్దీ సైక్లింగ్ గ్రూపు ఆధ్వర్యంలో మలికిపురం డిగ్రీ కళాశాల ప్రాంగణం నుంచి సఖినేటిపల్లి మూడు తూములు సెంటర్ వరకు జరుగుతుంది. అలాగే తిరిగి మలికిపురం గాంధీ బొమ్మల వరకు సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక విశ్వేశ్వరాయపురంలోని వివేకానంద ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. సైకిల్ లవర్స్, ఆరోగ్యాభిలాషులు, వాకర్స్ తమ తమ సైకిళ్లతో విరివిగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ నిషేధం కోసం స్టీల్, రాగి బాటిళ్లతో మంచినీళ్లు తెచ్చుకోవాలని, తెల్లని దుస్తులు ధరించి హాజరు కావాలని నిర్వాహకులు తెలిపారు. బోనం రాజు, పీవీ వీఎస్ ప్రసాద్, రమేష్ బాబు, నల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు



మందపల్లి శనైశ్చర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మండలంలోని మందపల్లిలో ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి ప్రాతఃకాల అర్చన అనంతరం భక్తులు తైలాభిషేకాలు, సర్వదర్శనాలు చేసుకున్నారు. దేవదాయ-ధర్మదాయ శాఖ డీసీ, ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో దేవస్థానం సిబ్బంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు. టిక్కెట్లు, వివిధ సేవల ద్వారా రూ 1,57,085 ఆదాయం వచ్చినట్లు డీసీ అండ్ ఈఓ తెలిపారు. అలాగే అన్నప్రసాద పథకానికి పలువురు భక్తుల ద్వారా విరాళాల రూపంలో మరో రూ.34,362 రాగా మొత్తం రూ.1,91,447 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

యోగాలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



పెదపళ్లలో యోగా డే అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ రాజు తదితరులు

ఆలమూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈనెల 21న ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగా డేలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ ఎ.రాజు పిలుపునిచ్చారు. మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న యోగా శిక్షణ తరగతులను శనివారం ఆయన పరిశీలించారు, శిక్షణ పొందిన అధికారులు, ప్రభుత్వ సిబ్బంది అంతా గ్రామాల్లో పర్యటించి యోగా డే అవశ్యకతను వివరించాలన్నారు. విద్యార్థులను సైతం ఈ కార్యక్రమంలో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీఓ రాజు ఆదేశించారు. అలాగే యోగా డే ఆవశ్యకతను పలు గ్రామ సచివాలయాల్లో ఆయన వివరించారు. అనంతరం యోగాలో శిక్షణ పొందేందుకు నమోదు చేసుకున్న ఆశావహుల వివరాలను ఆయన పరిశీలించారు.

ఉచిత మెగా వైద్య శిబిరం



రోటరీక్లబ్ వద్ద నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు

రాజోలు: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక రోటరీ కల్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ ప్రారంభించారు. మెడ్ యునైటెడ్ ఆధ్వర్యంలో సుమారు 100 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మెడ్ యునైటెడ్ వైద్యులు ఉదయ్ కుమార్, సుధీర్, ప్రవీణ్ రావు, లక్ష్మి వైద్య సేవలు అందించారు. మెడ్ యునైటెడ్ ఎండీ నరేష్, రోటరీ క్లబ్ కార్యదర్శి కోదాటి సోమరాజు, రోటరీ సభ్యులు దార్ల పెదబాబు, నామన షణ్ముఖ్, కసుకుర్తి రామకృష్ణ, చిట్టీడి లక్ష్మణరావు, మొహిద్దీన్ కిష్వర్, ఐ.సూర్యనారాయణ మూర్తి, నార్కెడిమిల్లి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకు బియ్యం బండి రాదండి..!

- ఇకపై రేషన్ షాపులకు వెళ్లాల్సిందే
- కార్డుదారులకు తప్పని తిప్పలు
- ఉపాధి కోల్పోయిన ఎండీయూ ఆపరేటర్లు
- ప్రజల్లో జగన్ ముద్ర చెరిపేయడమే బాబు లక్ష్యం



కొత్తపేటలో ఇంటింటా రేషన్ సరఫరా చేస్తున్న ఎండీయూ వాహనం ఆపరేటర్

కొత్తపేట: పనులు మానుకుని రేషన్ షాపుల వద్ద గంటల తరబడి పడిగాపులు, పెద్ద క్యూలైన్లు.. తీరా తమవంతు వచ్చేసరికి సర్వర్ మొరాయింపు.. ఇక చేసేదిలేక ఉసూరుమంటూ ఇంటిదారి పట్టాల్సిన పరిస్థితి. మళ్లీ మరుసటి రోజు నంచి పట్టుకుని బియ్యం కోసం ఉరుకులు పరుగులు... ఈ నెల 1 నుంచి ప్రభుత్వ చౌకదుకాణాల వద్ద మళ్లీ ఇలాంటి పరిస్థితులు పునరావృతం కానున్నాయి. ప్రతినెల ఇంటి ముంగిటకే వచ్చి పేదలకు ఇన్నాళ్లూ సరుకులు అందిస్తున్న మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్స్ (ఎండీయూ-బియ్యం బండ్లు)ను చంద్రబాబు ప్రభుత్వం రద్దు చేయడమే ఇందుకు కారణం. మరో పక్క ఉపాధి కోల్పోయిన ఎండీయూ ఆపరేటర్లు తమ భవిష్యత్తు ఏమిటో అర్థం కాక సతమతమవుతున్నారు. క్లస్టర్ పరిధి కొత్తపేట నియోజకవర్గంలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాల్లో 98,339 రేషన్ కార్డులు ఉండగా 2,77521 యూనిట్లు (సభ్యులు) ఉన్నారు. అలాగే పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లోని 7 మండలాల్లో సుమారు 1,72,093 కార్డులు ఉండగా సుమారు 4,85,661 మంది సభ్యులు ఉన్నారు. వీరందరూ ప్రతినెల ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం, చక్కెర తదితర నిత్యావసర సరకులు పొందుతున్నారు. రేషన్ షాపుల వద్ద కార్డుదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు గతంలో ఉండేవి. అలాగే అనేక గ్రామాల ప్రజలకు ప్రభుత్వ చౌక దుకాణం అందుబాటులో ఉండేది కాదు. నిత్యావసర సరకుల కోసం కిలోమీటర్ల దూరం వెళ్లి తెచ్చుకోవాల్సి వచ్చేది. ప్రజలు పడుతున్న ఇబ్బందులను గ్రహించిన నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఇంటి ముంగిటకే నిత్యావసరాలు అందజేసే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ విధానం దేశంలోని పలు రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలిచింది. రేషన్‌షాపు డీలర్ల ఉపాధికి ఏ మాత్రం దెబ్బ తగలకుండా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎండీయూ వాహనాలను ప్రవేశపెట్టింది. దీంతో బడుగు, బలహీన వర్గాల నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి, సామాజిక న్యాయం, సాధికారత లభించింది. బియ్యం బండి ఎప్పుడు వస్తుందో ముందుగానే వలంటీర్లు కార్డుదారులకు తెలియజేసేవారు. ఇందువల్ల వినియోగదారుల రోజువారి పనులకు ఎలాంటి ఇబ్బంది ఏర్పడేది కాదు. గంటల తరబడి క్యూలో నిలుచునే పరిస్థితి ఎన్నడూ ఉత్పన్నం కాలేదు. అలాగే తమకు సరుకులు అందలేదని ఫిర్యాదులు సైతం లేవు. ఇప్పటివరకు ఎండీయూ వాహనాల పద్ధతి ద్వారా ప్రజలకు నిత్యావసరాలు సవ్యంగా అందుతున్నాయి. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితులు తారుమారయ్యాయి. జగన్‌మోహన్ రెడ్డి హయాంలో తమకు మేలు జరిగిందనే ముద్ర పేదల గుండెల్లో నుంచి చెరిపేసేందుకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం యత్నిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే వలంటీర్ల వ్యవస్థను తొలగించారు. ఇప్పుడు ఎండీయూ వాహనాలను తొలగించడం ద్వారా నిరుద్యోగ యువతను రోడ్లపాలు చేశారు. ఎండీయూ వాహనాలకు సంబంధించి 2027 వరకు ప్రభుత్వంతో ఒప్పందం ఉన్నప్పటికీ దాన్ని కాదని వాహనాలను కూటమి ప్రభుత్వం తొలగించింది. జూన్ 1 నుంచి కార్డుదారులు రేషన్ షాపుల వద్దకే వెళ్లి సరుకులు తెచ్చుకోవాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. 65 సంవత్సరాలు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు మాత్రం సరుకులను డోర్ డెలివరీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే డోర్ డెలివరీ ఎవరు చేస్తారో మాత్రం స్పష్టత ఇవ్వలేదు.

ఇకపై పనులు మానుకుని రేషన్‌కు వెళ్లాలి



గత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల కష్టాలు దృష్టిలో ఉంచుకుని ఇంటి వద్దకే రేషన్ అందించే కొత్త విధానానికి శ్రీకారం చుట్టారు. ఈ పద్ధతి వల్ల పేదలు పనులు పోగొట్టుకుని రేషన్ షాపులకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా ఉండేది. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అమలు చేయకపోవడమే కాకుండా ప్రజలకు ఎంతో ఉపయోగపడే బియ్యం బండ్లను తొలగించడం అన్యాయం.

– కుర్రా లక్ష్మి, కొత్తపేట

చాలా సౌలభ్యంగా ఉండేది



ఎండీయూ ఆపరేటర్ల ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరకులు అందించడం వల్ల ప్రజలకు ఎంతో సౌలభ్యంగా ఉండేది. బియ్యం బండి ఎప్పుడు వస్తుందో సమాచారం అందించేవారు. గతంలో మాదిరి రేషన్ షాపుల వద్ద పడిగాపులు కాయాల్సిన పని లేకుండా ఉండేది. ఇప్పుడు పనులన్నీ వదులుకొని రేషన్ షాపుల వద్దకు వెళ్లాల్సి వస్తుంది. ప్రభుత్వం పునరాలోచించి ఇంటి వద్దకే రేషన్ అందించే పద్ధతినే కొనసాగించాలి.

– పుచ్చకాయల మంగ, గంటి

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

అంబాజీపేట: స్థానిక వీరభద్ర థియేటర్ సమీపాన వేంచేసిన విజయ కనకదుర్గ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బండారు ఆదినారాయణమూర్తి ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు, గణపతి పూజలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అమ్మవారిని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, కొర్లపాటి గోపి, శిరిగినీడి వెంకటేశ్వరరావు, మైపాల తాతాజీలు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రీ వేల్యూయేషన్లో లోపాలు కూడా సరిదిద్దలేదు

మలికిపురం: పదో తరగతి పరీక్షలు రాసిన (2025) విద్యార్థులకు పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనంలో అనేక అవకతవకలు జరగడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ నాయకుడు దేవ రాజేంద్రప్రసాద్ తీవ్రంగా విమర్శించారు. శనివారం ఆయన మాట్లాడుతూ పరీక్షలు బాగా రాసినప్పటికీ మూల్యాంకనం సరిగా చేయకపోవడంతో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురయ్యారని, తల్లిదండ్రులు రూ.వెయ్యి రీ వేల్యూయేషన్ ఫీజు కట్టినప్పటికీ రీ వేల్యూయేషన్లో జవాబులు సరిగా ఉన్నవాటికి కూడా మార్కులు వేయకుండా యథాతథంగా తిరిగి మార్కుల లిస్ట్ పంపించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. దీనిపై అంబేడ్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేశామన్నారు. అదే విధంగా ట్రిపుల్ ఐటీలో కూడా ప్రవేశాలకు తగినంత సమయం లేదు. కాబట్టి ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలను జూన్ పది వరకు పెంచాలని రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. మూల్యాంకనంలో తప్పులు చేసి విద్యార్థులకు నష్టం కలిగించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.

సైనికులకు సంఘీభావంగా తిరంగా యాత్ర



కొత్తపేటలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న పాలూరి తదితరులు

కొత్తపేట: భారత సైనికులకు సంఘీభావంగా కొత్తపేటలో తిరంగా యాత్ర నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షుడు సంపతి కనకేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక గ్రామ దేవత బంగారమ్మ తల్లి ఆలయం నుంచి కమ్మిరెడ్డిపాలెం సెంటర్ వరకు బోలో భారత్ మాతాకీ జై, ఉగ్రవాదులు నశించాలి, భారతీయుల ఐక్యత వర్ధిల్లాలి అనే నినాదాలతో ర్యాలీ ఉత్సాహంగా సాగింది. యుద్ధంలో అసువులు బాసిన అమర జవాన్ మురళీ నాయక్‌కు, పహల్గాం మృతులకు వారు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ విళ్ళ మారుతీప్రసాద్, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ ఐనవెల్లి సత్తిబాబు, రాష్ట్ర యువ మోర్చా అధికార ప్రతినిధి పాలూరి జయప్రకాష్ నారాయణ, జిల్లా బీజేపీ కార్యదర్శి గొలకోటి వెంకటేశ్వరరావు, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు కోనసీమ బౌద్ధ ప్రముఖ్ టి.ఆంజనేయులు, జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకుడు తమ్మన సాయిప్రసాద్ , బీజేపీ నాయకులు భమిడిపాటి లక్ష్మీనారాయణ, కోటిపల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానంతో రైతులకు లాభం



అంబాజీపేట పరిశోధన కేంద్రంలో విజ్ఞాన ప్రదర్శనను పరిశీలిస్తున్న చలపతిరావు, ముత్యాల నాయుడు

అంబాజీపేట: అన్ని రకాల పంటల సస్యరక్షణకు సంబంధించి డ్రోన్ టెక్నాలజీని రైతులు వినియోగిస్తే మంచి ఫలితాలతో పాటు అధిక లాభాలు పొందవచ్చని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి డా.ఎన్‌బీవీ చలపతిరావు అన్నారు. అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రంలో రావేప్ వ్యవసాయ విద్యార్థులతో రైతు సదస్సును కేంద్ర అధిపతి డాక్టర్ ఎం.ముత్యాల నాయుడు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. చలపతిరావు మాట్లాడుతూ రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని అందుకు అనుగుణంగా డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించడం వల్ల ఎన్నో లాభాలు పొందవచ్చన్నారు. రావేప్ (గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమం) వ్యవసాయ విద్యార్థులు 19 అంశాలతో నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం వ్యవసాయ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, రాబోయే తరాలకు ఉపయోగపడే నూతన ఉద్యానసాగుపై ప్రదర్శించిన నృత్య రూపకం రైతులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ వి.గోవర్ధన్‌రావు, డాక్టర్ వి.అనూష. డాక్టర్ బి.నీరజ, డాక్టర్ ఎ.కిరీటి, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, ఎంపీటీసీ సత్యవతి, రైతులు, రావేప్ విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా కనకమహాలక్ష్మమ్మ విగ్రహ ప్రతిష్ఠ



చొప్పెల్లలో ప్రతిష్ఠించిన కనకమహాలక్ష్మి అమ్మవారు

ఆలమూరు: మండలంలోని చొప్పెల్లలో నూతనంగా నిర్మించిన గ్రామదేవత కనకమహాలక్ష్మి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ప్రముఖ వేద పండితుడు కాళ్లకూరి కాశీశేఖర్‌బాబు, కాళ్లకూరి రవితేజశర్మ మంత్రోచ్చారణల మధ్య పురోహితుల బృందం శైవాగమ పద్ధతిలో అమ్మవారిని ఆలయంలో ప్రతిష్ఠించి అలాగే శిఖర ప్రతిష్ఠ జరిపారు. అమ్మవారిని గజమాలతో అలంకరించిన తీరు, ఆలయానికి చేపట్టిన విద్యుత్తీలంకరణ భక్తులను అమితంగా ఆకట్టుకుంది. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి కనకమహాలక్ష్మి అమ్మవారి ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని కనులారా తిలకించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం సుమారు 20 వేల మందికి భారీ అన్నసమారాధన జరిగింది. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ధూమపానానికి దూరంగా ఉండండి



పెదపళ్లలో పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలను వివరిస్తున్న సిబ్బంది



ముక్కామలలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఉద్యోగులు

అంబాజీపేట: పొగతాటం వల్ల ఊపిరితిత్తులు దెబ్బతినడమే కాకుండా క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని పొగతాగే అలవాటు మానుకోవాలని వైద్యాధికారులు కేఎన్ శ్రీనివాస్, టి.దివ్యశ్రీ అన్నారు. అంతర్జాతీయ పొగాకు నిరోధక దినం సందర్భంగా అంబాజీపేట, ముక్కామల పీహెచ్‌సీల ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ పొగతాగే వారితో పాటు ఆ పొగను పీల్చేవారి (పాస్సివ్ స్మోకర్స్)కి కూడా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. చిన్నారులు, స్త్రీలకు పాసివ్ స్మోకింగ్ వల్ల అధిక ప్రమాదమన్నారు. ప్రతి ఒక్కరూ ధూమపానానికి దూరంగా ఉండాలని కోరారు. అనంతరం బ్రోచర్లను విడుదల చేసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

పెదపళ్లలో..

ఆలమూరు: ప్రజల ప్రాణాలను హరించే పొగాకు ఉత్పత్తులను ప్రోత్సహించకూడదని, వినియోగించవద్దని కొత్తపేట అదనపు జిల్లా వైద్యాధికారి ఎం.సుమలత అన్నారు. మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలో వైద్యాధికారులు ఎస్.లక్ష్మీస్నేహ, బి.అనంత రామకృష్ణ నేతృత్వంలో వైద్య ఆరోగ్య సిబ్బంది శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లోనున్న హెల్త్ క్లినిక్‌ల్లో ఎంఎల్‌హెచ్‌పీలు ఇంటింటికీ వెళ్లి పొగాకు వల్ల కలిగే దుష్పరిణామాలను, దుష్ఫలితాలను వివరించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ధూమపానం వద్దు-జీవితమే ముద్దు అంటూ నినాదాలు చేస్తూ గ్రామ పురవీధుల్లో భారీ ర్యాలీలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెచ్ఈలు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి, ఫార్మసిస్టు డి.సుగుణలక్ష్మి, ఆరోగ్య ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం పర్యటనలో పోలీసుల తీరు సరికాదు

ఆలమూరు: విద్యార్థుల సమస్యలను చెబుదామని సీఎం చంద్రబాబు పర్యటించిన ప్రాంతానికి వస్తే పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.రవికుమార్ విమర్శించారు. ఆలమూరులో శనివారం ఆయన మాట్లాడుతూ విద్యారంగానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఉన్న అనేక సమస్యలను వినతిపత్రం రూపంలో అందజేస్తామని చెయ్యేరు వెళితే అక్కడ తమను పోలీసులు అడ్డుకోవడంతో పాటు అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించడం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు. ఇక నుంచి విద్యార్థుల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించే వరకూ రాష్ట్ర వ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు వెంకట్, సతీష్, కుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామి వార్ల దివ్య కల్యాణం



గోగన్నమఠంలో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మామిడికుదురు: గోగన్నమఠంలో కొలువైన చతుర్భుజ భద్రాద్రి సీతారామస్వామి, శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి వార్ల దివ్య తిరు కల్యాణ మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామి వార్ల దశమ వార్షికోత్సవంలో భాగంగా ఉదయం వేద మంత్రాలతో ఆలయ అర్చకులు స్వామి వార్ల ధృవ మూర్తులకు విశేష అభిషేకం జరిపించారు. అనంతరం కల్యాణ మహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. పలువురు భక్త దంపతులు ఈ కల్యాణోత్సవంలో కల్యాణ కర్తలుగా పాల్గొన్నారు. తదుపరి స్వామి వార్ల గ్రామోత్సవం కన్నులపండువలా జరిగింది. పుష్పోత్సవంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, అర్చకుల నుంచి వేద ఆశీర్వచనం అందుకున్నారు. ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయం వద్ద ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

రాష్ట్ర ప్రభుత్వమూ బియ్యం పంపిణీ చేయాలి

సఖినేటిపల్లి: కేంద్రం ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజనలో ఇస్తున్న ఉచిత బియ్యంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం రూపాయికే ఇవ్వాల్సిన బియ్యాన్ని కూడా పంపిణీ చేసేటట్టు చూడాలని బీజేపీ నాయకులు శనివారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు. ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, రాష్ట్ర డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామ కృష్ణంరాజు, పార్టీ అధ్యక్షుడు పోతురాజు సురేష్ ఆ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం ఈ బియ్యాన్ని ఇవ్వడం వల్ల లబ్ధిదారులకు మరింత ప్రయోజనం చేకూరుతుందన్నారు. కాగా రేషన్ దుకాణాలను పునరుద్ధరించి రేషన్ పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయంపై నాయకులు ఆ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

నదీ పాయల వద్ద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

పి.గన్నవరం: ఇటీవల గోదావరి నదీపాయల్లో విద్యార్థులు స్నానాలకు వెళ్లి లోతు తెలియక ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో పి.గన్నవరం మండలంలోని పలు ప్రాంతాల్లో హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్టు తహసీల్దార్ పి.శ్రీపల్లవి తెలిపారు. ఇందులో భాగంగా ఎల్.గన్నవరం పుష్కరాల రేవు వద్ద శనివారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అలాగే మండలంలోని నదీ పరివాహక ప్రాంతాలైన జి.పెదపూడి, ఊడిమూడి, బెల్లంపూడి, వైఎస్ పాలెం, పి.గన్నవరం, ఎల్.గన్నవరం, మానేపల్లి, నాగుల్లంక, వై.కొత్తపల్లి, ఆర్.ఏనుగుపల్లి, కె.ఏనుగుపల్లి, కె.ముంజవరం తదితర గ్రామాల్లో నదీపాయల వద్ద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమంలో వీఆర్ఓ పి.నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



ఎల్.గన్నవరం పుష్కరాల రేవు వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు →

రేపటి ధర్నాలను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్

రావులపాలెం: సీపీఐ పిలుపు మేరకు జూన్ రెండో తేదీన మండల కేంద్రాల్లో తహసీల్దార్ కార్యాలయాల వద్ద చేపట్టనున్న ధర్నాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్ అన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం రావులపాలెంలో ఒక హోటల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రభాకర్ మాట్లాడుతూ పార్టీ మండల, నియోజకవర్గ మహాసభలు షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలన్నారు. జులై 19, 20, 21 తేదీల్లో జిల్లా మహాసభ అమలాపురంలో నిర్వహించాలన్నారు, ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఇల్లు నిర్మించుకునే వారికి రూ.ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన కాలనీలో పట్టాలు ఇవ్వని వారికి పట్టాలు అందజేయాలన్నారు. నిరుపయోగంగా ఊరికి దూరంగా ఉన్న కాలనీలో స్థలాలు ఇవ్వడంపై లబ్ధిదారులు నిరాశక్తి చూపుతున్నారని ఈ సమస్యను పరిష్కరించేందుకు జూన్ రెండో తేదీన అన్ని మండల కేంద్రాల్లో ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి వివరించాలని సమావేశంలో తీర్మానించినట్టు జిల్లా కార్యదర్శి సత్తిబాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



తోలేటి నారాయణ మూర్తి (ఫైల్)

ఆలమూరు: 216ఏ జాతీయ రహదారిలోని మూలస్థాన అగ్రహారం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తోలేటి నారాయణమూర్తి (60) మృతి చెందాడు. ఆలమూరు పోలీసుల కథనం ప్రకారం పాడిరైతు అయిన నారాయణమూర్తి తమ పశువుల దాణా కోసం సమీపంలోని జొన్నాడ వెళ్లి సైకిల్‌పై తిరుగు ప్రయనమయ్యాడు. అంతలో రావులపాలెం వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న ట్రావెల్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో నారాయణమూర్తికి శరీరానికి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ కేసు నమోదు చేయగా ఎస్సై ఎం.అశోక్ దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలకు ఇన్వర్టర్ బహూకరణ

పి.గన్నవరం: నరేంద్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు 1991–92 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు శనివారం రూ.18 వేల విలువైన ఇన్వర్టర్‌ను బహూకరించారు. పాఠశాల హెచ్ఎం అక్కిరెడ్డి సూర్యనారాయణ పూర్వ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘ నాయకులు పేపకాయల చంద్రరావు, గుత్తుల సోంబాబు, కుసుమ ఆనందరాజు, కె.రవికుమార్, యల్లమిల్లి చంద్రయ్య, పిడకాల మోషే తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మవార్ల తీర్థం

తాళ్లరేవు: మండలంలోని పిల్లంక గ్రామ దేవతలు నూకాలమ్మ, రావులమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం తీర్థం జరగనుంది. ఇందులో భాగంగా అమ్మవార్ల జాతరను శనివారం రాత్రి గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవార్లకు మొక్కుబడులు సమర్పించారు. తీర్థ మహోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.

మార్పుతోనే మలేరియా అంతం

అమలాపురం టౌన్: మన అందరిలో మార్పుతోనే మలేరియా అంతం అవుతుందని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం.దుర్గారావు దొర అన్నారు. ఈ నెల 1 నుంచి నెలాఖరు వరకూ జరగనున్న మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలో పలు వైద్య సూచనలతో ముద్రించిన బ్యానర్లను డాక్టర్ దుర్గారావు దొర ఆవిష్కరించారు. జిల్లా మలేరియా అధికారి ఎస్.వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇళ్ల ఆవరణలో నీటి నిల్వలు లేకుండా, దోమల నిర్మూలనకు చర్యలు చేపడుతూ దోమ తెరలను విధిగా ప్రతి ఒక్కరూ వాడాలని వెంకటేశ్వరరావు సూచించారు. జిల్లాలోని వార్డు, గ్రామ సచివాలయాలు, ఆరోగ్య కేంద్రాల వద్ద మలేరియా నిర్మూలనకు ఈ నెల రోజులూ అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. మలేరియా శాఖ సిబ్బంది, సబ్ యూనిట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

బాధిత బాలుడికి చేయూత

అమలాపురం టౌన్: సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా అమలాపురంలో రీ రిలీజ్ అయిన ఖలేజా సినిమా ప్రదర్శన ద్వారా వచ్చిన నగదును ఫ్రేగు వ్యాధితో బాధపడుతున్న బాలుడు దంగేటి భార్గవ్ చంద్ర వినయ్‌కు కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు అందించారు. ఆ బాలుడి వైద్య ఖర్చుల నిమిత్తం ఈ నగదు ఉపయోగించుకోవాలని అభిమాన సంఘాల నాయకులు కోరారు. అలాగే స్థానిక లలిత థియేటర్ వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు.